క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన



తెనాలి: కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ నిర్వహణకు సన్నాహాల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలను అధికారులు గురువారం పరిశీలించారు. తెనాలిలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 24 బూత్‌లను సిద్ధం చేస్తున్నారు. మధ్యాహ్నం మారీసుపేటలోని ఏసీఆర్‌ఎం హైస్కూల్‌ను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కె.వి. గోపాలకృష్ణ, త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్ బాబులు సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో బూత్‌ల వద్ద పరిస్థితి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బూత్‌ల వద్ద ఓటర్లకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కోడ్ అమలులోకి వచ్చిందని, ఎవరూ ఉల్లంఘనలకు పాల్పడవద్దని స్పష్టంచేశారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుంటే చర్యలు



తెనాలి అర్బన్: పట్టణంలోని వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్‌లో తీసుకోవాలని, అలా చేయని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి హెచ్చరించారు. మున్సిపల్ మార్కెట్ ప్రాంతాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లపై ఆరా తీశారు. అందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. చేపలు, మాంసం మార్కెట్ విక్రయదారులు ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



తెనాలి: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం భారతీయ స్టేట్ బ్యాంక్ శ్రీకారం చుట్టింది. రాజమండ్రికి చెందిన కళాకారులను రప్పించి రెండురోజులపాటు తెనాలిలో వీధినాటికల ప్రదర్శనకు నిర్ణయించింది. తొలిరోజైన గురువారం స్థానిక మార్కెట్ సెంటర్, చెంచుపేట, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ అధికారి శ్రీనివాసు, పోలీస్ శాఖ తరపున శ్రీనివాసరావు, బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు మాట్లాడారు.

సీపీఎం మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



తెనాలి అర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో జరగనున్న 27వ మహాసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కె.బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డిలు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లో గురువారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో తమ పార్టీకి చెందిన బస్సుజాత జరుగుతుందని చెప్పారు. శుక్రవారం తెనాలి చేరుతుందని, మార్కెట్‌లోని అన్నాబత్తుని పురవేదిక వద్ద సమావేశం జరగనుందని వివరించారు. బస్సుకు పెద్ద సంఖ్యలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఘనస్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, జి.వెంకటసుబ్బయ్య, జి.రాంబాబు, డి.రత్నబాబు, పి.మురళీకృష్ణారెడ్డి, పి.కాశీవిశ్వనాథం, జి.ఏడుకొండలు, ఆర్.శివారెడ్డి, డి.రమణారెడ్డి, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన అవసరం

గుంటూరు మెడికల్: సర్వేకల్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక పాత గుంటూరు వీఆర్ హైస్కూల్‌లో శ్రీ బాలాజీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.సంధ్యారాణి మాట్లాడుతూ యువతుల్లో ఎక్కువగా సర్వేకల్ క్యాన్సర్ పెరిగిపోతోందని తెలిపారు. అవగాహన పెంపుతో కట్టడి చేయవచ్చని చెప్పారు. 45 ఏళ్ల దాటిన మహిళలు, బాలికలు వ్యాక్సిన్ ద్వారా సర్వేకల్ క్యాన్సర్ బారిన పడకుండా చూసువచ్చని తెలిపారు.

భావనారుషిస్వామి కళ్యాణోత్సవాలకు శ్రీకారం



ఉత్సవాల పోస్టరు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తెనాలి: పట్టణ షరాఫ్ బజార్‌లోని శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి దేవస్థానంలో శ్రీస్వామివారి కళ్యాణ మహోత్సవాలు ఆరంభమయ్యాయి. ఈ వేడుకలకు 8న అంకురార్పణ చేసిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం ఆలయ కమిటీ నాయకులు ఉత్సవ పోస్టరును ఆవిష్కరించారు. అక్కడ్నుంచి ఉత్సవ సందడి మొదలైంది. ఫిబ్రవరి 17వ తేదీ వరకు వైభవంగా కొనసాగుతాయి. తొలిరోజున రాత్రి 7 గంటలకు ధ్వజారోహణ చేశారు. తర్వాత శ్రీస్వామి వారిని పెండ్లి కుమారుడిని చేశారు. 31వ తేదీన నెమలి వాహనోత్సవం, ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం నెమలి వాహనోత్సవం, రాత్రి పొగడ మానోత్సవం, 2న రాత్రి శ్రీస్వామివారికి భృంగీశ్వర వాహనోత్సవం, అమ్మవారికి గజవాహనోత్సవం వేడుకగా చేస్తారు. ఫిబ్రవరి 3న తెల్లవారుజామున కళ్యాణోత్సవం జరుగుతుంది. అదేరోజు సాయంత్రం పులి వాహనోత్సవం, రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. 4న ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, రాత్రి 8 గంటలకు సహస్ర దివిటీల ఉత్సవం, కీలుగుర్రం వాహనం ఉంటాయి. 5 నుంచి 17వ తేదీవరకు రోజూ రాత్రి ఏడు గంటలకు స్వామివారి పవళింపు సేవలు జరుగుతాయి. 9న రాత్రి 7 గంటలకు దేవస్థానం వద్ద సమారాధన నిర్వహిస్తారు. చివరి రోజైన ఫిబ్రవరి 17న రాత్రి శ్రీస్వామివారి 16 రోజుల పండుగ ఉత్సవం కీలుగుర్రంపై నగరోత్సవం ఉంటాయని నిర్వాహకులు వివరించారు. పోస్టరు ఆవిష్కరణలో పెద్ద శ్రేష్ఠులు జొన్నాదుల కృష్ణ సత్యనారాయణ, జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి శివసత్యనారాయణ వరప్రసాద్, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ చిన్నం హరిగోపాల్, ఉత్సవ కమిటీ సభ్యులు జొన్నాదుల మదనమోహనరావు, ఆకురాతి శ్రీనివాసరావు, తాడిపర్తి శ్రీనివాసరావు, గుంటి ధనలక్ష్మి, తాడిపర్తి చంద్రశేఖరరావు, కొతరపు వెంకటరమణ, పాలిశెట్టి వెంకటేశ్వరరావు, పద్మశాలి బహూత్తమ సంఘం గౌరవాధ్యక్షుడు జొన్నాదుల మహేష్, సభ్యులు అక్కల శ్రీరామ్, హేమంతకుమార్, గుంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి



తెనాలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ రమేష్‌బాబు



కొల్లిపర ర్యాలీలో ఎస్ఐ కోటేశ్వరరావు తదితరులు

తెనాలి రూరల్: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా తెనాలిలో మహిళలతో హెల్మెట్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. టూ టౌన్ సర్కిల్ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం చేపట్టిన బైక్ ర్యాలీని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు టూ టౌన్ సీఐ రాములునాయక్, రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించారు. రజక చెరువు, గాంధీచౌక్, కొత్తపేట, చినరావూరు పార్క్, బోసురోడ్డు, వహాబ్ చౌక్, రైల్వేస్టేషన్ మీదుగా ర్యాలీ సాగింది. సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

అన్నింటికన్నా విలువైనది ప్రాణం

కొల్లిపర: జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో గురువారం పోలీసులు, యువత హెల్మెట్లు ధరించి ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి ర్యాలీ ప్రారంభమై.. కొల్లిపర, దావులూరు అడ్డరోడ్డు, తూములూరు గ్రామం మీదుగా వివిధ గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్టు ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులను గుర్తుపెట్టుకుని వాహనాలు నడపాలని సూచించారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన నల్లచెరువు, నంబూరి సుభాని కాలనీ, శివరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆస్తి పన్ను వసూళ్లు, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చేపట్టే అభివృద్ధి పనులకు పన్నుల వసూళ్లు కీలకమని తెలిపారు. నూరు శాతం వసూళ్లకు వార్డ్ సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అండర్, అన్ అసెస్మెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. రెవెన్యూ అధికారులు కూడా తమ పరిధిలో ర్యాండమ్‌గా ఆస్తి పన్నులను తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్‌లలో మురుగు పారుదల లేకపోవడం గమనించారు. రోడ్ల మీద భవన నిర్మాణ వ్యర్థాలు, సామగ్రి వేసే వారిని తక్షణం తొలగించే విధంగా చూడాలని ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్లు శుభ్రం చేయాలని శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ అడకా పద్మావతి, డీఈఈ మధుబాబు, రెవెన్యూ అధికారి మదన్ గోపాల్, ఆర్ఐలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ అధినేత, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద గురువారం ఉచిత మెగా మెడికల్ క్యాంపును మేడికొండూరు మండలం పాలడుగులో నిర్వహించారు. హార్ట్, బ్రెయిన్, క్యాన్సర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, యురాలజీ, డెంటల్, గైనకాలజీ విభాగాల వైద్యులు హాజరయ్యారు. రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ పక్షవాత రిస్క్ ఫాక్టర్స్, లక్షణాలు, నివారణా మార్గాలు గురించి వివరించారు. అధిక రక్తపోటు వల్ల 50 శాతం పక్షవాతం వస్తుందని తెలిపారు. రక్తపోటు (బీపీ) సైలెంట్ కిల్లర్ అంటారని, ప్రతి ఒక్కరూ అదుపులో ఉంచుకోవాలని చెప్పారు. గుండె సంబంధిత జబ్బులు, పెరిఫెరల్ వాస్కులర్ జబ్బుల గురించి డాక్టర్ ఫణి రాజు వివరించారు. లేజర్ చికిత్స ద్వారా కిడ్నీలో రాళ్ల తొలగింపు గురించి యురాలజిస్ట్ డాక్టర్ శరవణ కుమార్ తెలియజేశారు. నీరు ఎక్కువగా తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు రాకుండా నివారించవచ్చని తెలిపారు. శిబిరంలో 400 మందికి పైగా గ్రామస్తులు వైద్య సేవలు వినియోగించుకున్నారని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మతెలిపారు. అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, మందులు సైతం పంపిణీ చేసినట్లు వెల్లడించారు. శిబిరంలో అనస్తీషియా డాక్టర్ శాఖమూరి అనిల్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ డాక్టర్ రాజేష్, ఆర్థోపెడిక్స్ డాక్టర్ వివేక్, డెంటల్ డాక్టర్ స్వాతి, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి వెంకటేష్, డైటీషియన్ కావ్య, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య రంగానికి వన్నె తెచ్చిన డాక్టర్ నాగేశ్వరరెడ్డి

గుంటూరు మెడికల్: దేశంలో రెండో అత్యుత్తమ అవార్డు అయిన పద్మ విభూషణ్‌కు ఎంపికైన డాక్టర్ నాగేశ్వరరెడ్డి వైద్య రంగానికి వన్నె తెచ్చారని సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో డాక్టర్ నరేంద్రరెడ్డి హైదరాబాదులోని ఏఐజీ హాస్పిటల్‌లో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో నాగేశ్వర్‌రెడ్డి ధైర్యం చెప్పి ఆహార నియమాలు పాటించేలా చేసి లక్షలాది మందిని కాపాడారని గుర్తు చేశారు. వైద్య రంగంలో విశేష కృషి చేసి తమకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన పద్మ విభూషణ్‌కు ఎంపికవ్వడం రెండు తెలుగు రాష్ట్రాల వైద్యులకు గర్వకారణమని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఉదయం 8.30 గంటలకే వికలాంగులు జిల్లా వైద్యశాలకు చేరుకుని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాంపు జరిగింది. క్యాంప్‌లో నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎం చంద్రబాబు, సత్తెనపల్లి నుంచి వచ్చిన డాక్టర్ మాధురిలు, బాపట్ల నుంచి వచ్చిన ఆప్తమాలజీ వైద్యులు డాక్టర్ ఆషాకిరణ్, నరసరావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎస్ హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాలు

కొల్లిపర: మండల కేంద్రంలోని కొల్లిపర గ్రామంలో ఆర్యవైశ్య సంఘం కళ్యాణమండపములో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కొల్లిపర గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అన్నవరపు రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మండపంలో అమ్మవారి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 2025-26 సంవత్సరానికి చెందిన కొల్లిపర ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రమాణ స్వీకారం, కొల్లిపర వాసవీ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చుండూరు వెంకటరత్నం , కోశాధికారి కాజ వెంకటశివప్రసాదు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలని వినతి



తెనాలి: గాంధీజీ వర్ధంతిని గురువారం గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. స్థానిక రామలింగేశ్వరపేటలో గల ట్రస్ట్ కార్యాలయం (గాంధీ ఆశ్రమం)లో ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆర్‌ఆర్ గాంధీనాగరాజన్ ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కళ్లకు గంతలు కట్టుకుని ట్రస్ట్ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. స్త్రీలకు రక్షణ కల్పించాలని, మెరుగైన ప్రసూతి వైద్య సేవలను ప్రభుత్వం అందించాలని కోరుతూ సబ్ కలెక్టర్ వి.సంజన సింహాకు వినతిపత్రం అందజేశారు. ప్రపంచ శాంతి కోరుతూ దండియాత్ర-2 పేరుతో పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



మాలతి తల్లిని ఓదార్చుతున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్: తెనాలి-గుంటూరు ప్రధాన రహదారిలో ఈ నెల 27వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. తెనాలికి చెందిన ఇద్దరు యువతులు గుంటూరులో ఉద్యోగ బాధ్యతలు పూర్తి చేసుకుని స్కూటీపై వస్తుండగా ఎదురుగా పల్సర్ బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరు యువతులు తీవ్రంగా గాయపడగా మల్లెపాడుకు చెందిన చిలువూరు మాలతి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందిన సంగతి తెలిసిందే. మరో యువతి నాజరుపేటకు చెందిన దంతాల రమ్య తలతోపాటు కంటికి తీవ్ర గాయమై గుంటూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్ వారిని పరామర్శించారు. ఉదయం చికిత్స పొందుతున్న రమ్యను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం తెనాలి మల్లెపాడులో మాలతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

వ్యాధులపై అవగాహన ముఖ్యం



బోధకాలతో బాధపడుతున్న వారికి సెల్ఫ్ కేర్ కిట్‌లను పంపిణీ చేస్తున్న సుబ్బరాయణం

తెనాలి అర్బన్: ఉష్ణ మండల వ్యాధులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణ మండల వ్యాధుల దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధకాలు, డెంగీ, క్షయ, ఎయిడ్స్, మలేరియా తదితర వ్యాధులు ఎక్కువగా ఇక్కడి ప్రజలకు వస్తుంటాయని చెప్పారు. అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి , సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జి.శ్యామ్ తదితరులు మాట్లాడారు. అనంతరం లెప్రో సొసైటీ ద్వారా బోధకాల బాధితులకు చెప్పులు, సెల్ఫ్ కేర్ కిట్‌లను పంపిణీ చేశారు. అందె బాలచంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో న్యూరోపతికి అడ్డుకట్ట



మాట్లాడుతున్న డాక్టర్ సేవకుమార్

గుంటూరు మెడికల్: దీర్ఘకాల మధుమేహ బాధితులు, కొన్ని విటమిన్ల లోపాలు గల వారిలోనూ తలెత్తే నరాల సమస్య 'న్యూరోపతి'ని ముందు జాగ్రత్తల ద్వారా నిరోధించవచ్చునని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ టి.సేవ కుమార్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత న్యూరోపతి పరీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ మేనేజర్ పి. నిర్మలరాణి అధ్యక్షత వహించారు. డాక్టర్ సేవ కుమార్ మాట్లాడుతూ మధుమేహ బాధితులలో దీర్ఘకాలం రక్తంలోని షుగర్ శాతం అసాధారణంగా అధిక స్థాయిలో ఉంటుందని తెలిపారు. దీనివల్ల నరాల కణాలపై ఉండే కణత్వచం దెబ్బతిని అసాధారణ మార్పులు వస్తాయన్నారు. ఫలితంగా అరిచేతులు, అరికాళ్ల తిమ్మిర్లు ,మంటలు ఉంటాయని వివరించారు. కాళ్ల చేతులలో మంటలు గలవారు మధుమేహ పరీక్షలు, మధుమేహం లేనివారు ముఖ్యంగా విటమిన్ బీ 12 వంటి పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. ఎస్‌హెచ్ఓ మేనేజర్ పి. నిర్మలరాణి మాట్లాడుతూ న్యూరోపతిపై ప్రజల్లో శాస్త్రీయ అవగాహన అవసరమని తెలిపారు. ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రెండుసార్లు న్యూరోపతి పరీక్ష ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. అనంతరం న్యూరోపతి పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోక్టర్ అండ్ గ్యాంబ్లీ కంపెనీ ప్రతినిధి డి .శివసత్యనారాయణ, సాయిరాం, ఫిరోజ్ పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు రంగం సిద్ధం

- బరిలో 12 మంది కార్పొరేటర్లు
- తొలుత 17 మంది నామినేషన్ల దాఖలు
- ఐదుగురు ఉపసంహరణ
- ఫిబ్రవరి 3న ఎన్నికలు
- అదే రోజు ఫలితాల వెల్లడి



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ వెంకటరెడ్డి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఫిబ్రవరి 3న జరగనున్న ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు తుది పోటీలో ఉన్నారని, నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజైన గురువారం ముగ్గురు చేసుకున్నారని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు 17 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. వారిలో పఠాన్ రిహాన (57), తేలుకుట్ల హనుమాయమ్మ (19)లు బుధవారం ఉపసంహరణ చేసుకున్నారని చెప్పారు. గురువారం పోతురాజు సమత(6), అచ్చాల వెంకటరెడ్డి (30), షేక్ రోషన్ (29) కూడా ఉపసంహరణ చేసుకున్నారని తెలిపారు. ఉపసంహరణల అనంతరం తుది పోటీల్లో అడకా పద్మావతి, అంజలి మర్రి, ఈరంటి వర ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వర రావు, గోపి శ్రీనివాస్, దాసరి లక్ష్మీదుర్గ, దూపాటి వంశీబాబు, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, యాట్ల రవికుమార్, రాజులత బూసి, షేక్ మీరావలి ఉన్నారని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికలు జరుగుతాయని, అనంతరం ఓట్ల లెక్కింపు అదే రోజు జరుగుతుందని ఆయన తెలిపారు.

గాంధీకి ఘన నివాళి



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ విజయకృష్ణ, అధ్యాపకులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ నవచైతన్య బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక మున్సిపల్ మార్కెట్ సెంటరులోని సంఘ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షుడు మేడిబోయిన గంగా యాదవ్ తదితరులు గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లంపల్లి భీష్మపాములు, మాజీ కౌన్సిలరు కరేటి రవి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మేడిబోయిన రమణ, నియజకవర్గ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్, గౌతమి, జస్వంత్, పట్టణ అధ్యక్షుడు బట్టు శ్రీనివాసరావు, బుర్రా శ్రీను, బి.ప్రేమ్‌కుమార్, పి.శివ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో నడవాలి...

తెనాలి అర్బన్: మహాత్మా గాంధీ చూపిన బాటలో అందరూ నడవాలని ఎస్‌ఆర్‌కే అండ్ కేఎస్‌ఆర్ గుప్తా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ పేర్కొన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... శాంతి మార్గంలో ఉద్యమాలను నిర్వహించాలని గుర్తు చేశారు. అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, కె.వి.రవి కుమార్, షేక్ రఫీ, ఆర్.వి.సునీత, ఎ.నాగరాజు, ఎ.బాలగోపాల్, నాగార్జునకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమర వైద్యులకు నివాళి



తెనాలి రూరల్: కరోనా సమయంలో డ్యూటీ చేస్తూ ప్రాణాలు అర్పించిన వైద్యులకు క్యాండిల్స్ వెలిగించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ సభ్యులు నివాళులర్పించారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఐఎంఏ కార్యాలయం వద్ద గురువారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కావూరి అనిల్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ మధు ప్రభాకర్, డాక్టర్ ఉప్పల పావని ప్రియాంక, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ కొత్తమాసు శ్యాంప్రసాద్, డాక్టర్ ఆవుల చక్రవర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ పాలడుగు ఉమామహేశ్వరరావు తదితర వైద్యులు పాల్గొన్నారు.